సాక్షి కర్నూలు

మంగళవారం ı 4 ı ఏప్రిల్ ı 2023



మల్లన్నకు సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు.వెయ్యి దీపాలు వెలిగించి, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.



అన్నప్రసాదానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నదాన పథకానికి సోమవారం ఎన్టీఆర్ జిల్లాకు చెందిన టి.రామకృష్ణదుర్గాప్రసాద్ రూ.లక్ష, కర్ణాటకకు చెందిన శంకరప్ప, యాదగిరి రూ.1.25లక్షలు విరాళమిచ్చారు.



గరుడవాహనంపై రంగనాథుడు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు సోమవారం స్వామి వారు గరుడవాహనంపై ఊరేగారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:36	ఉ॥ 4:47
ఆదోని	సా॥ 6:39	ఉ॥ 4:50
నంద్యాల	సా॥ 6:35	ఉ॥ 4:50
ఆత్మకూరు	సా॥ 6:34	ఉ॥ 4:44
బనగానపల్లె	సా॥ 6:37	ఉ॥ 4:44

హదీస్ వెలుగు :

రంజాన్ ఉపవాస దీక్ష పాటించే వారి పట్ల అల్లాహ్ అత్యంత కరుణ చూపుతారు. రోజా ఉన్న వారి కోసం సముద్రంలోని చేపలు సైతం దువా చేస్తాయి. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీకి శ్రీకారం

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక ఏప్రిల్ నెల పంపిణీ సోమవారం నుంచి మొదలైంది. వరుస బ్యాంకు సెలవుల కారణంగా గ్రామ, వార్డు సచివాలయాలకు నగదు చేరడం ఆలస్యమైంది. వలంటీర్లకు నగదు చేరడానికి సాయంత్రం వరకు సమయం పట్టడంతో కొన్ని గ్రామాల్లో పింఛన్ల పంపిణీ మొదలు కాలేదు. మొదటి రోజున కొన్ని గ్రామాల్లో 1 నుంచి 2 శాతం వరకే పంపిణీ చేసినట్లు సమాచారం. మంగళవారం ఉదయం నుంచే వార్డు, గ్రామ వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తారని డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ నెల 7వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కొనసాగుతుందన్నారు.

చేపల పెంపకంపై మూడు నెలల శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): చేపల పెంపకం, మార్కెటింగ్‌లో ఆసక్తి కలిగిన యువతకు మూడు నెలల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామలమ్మ తెలిపారు. మే నెల 1 నుంచి జూలై 31 వరకు శిక్షణా కార్యక్రమం కర్నూలులోని దేశీయ మత్స్య శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. స్వయం ఉపాధిలో రాణించేందుకు చేపల పెంపకం చక్కటి అవకాశమని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన యువత ఈ నెల 28వ పూర్తి చేసిన దరఖాస్తులను కర్నూలు నగరం బంగారుపేటలోని మత్స్యశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. 29న ఉదయం 10.30 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

5న జగ్జీవన్‌రాం జయంతి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం 116వ జయంతిని ఈ నెల 5వ తేదీన ఘనంగా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా సాంఘిక సంక్షేమం, సాధికారత అధికారి ఎస్‌పీఎస్‌ఎన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐదు రోడ్ల కూడలిలో ఉదయం 9 గంటలకు జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళి అర్పించి అనంతరం అక్కడే బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన అధికారులు, ప్రముఖులు, దళిత సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.అలాగే జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జగ్జీవన్‌రాం జయంతి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి తెలిపారు.

ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



నాగజ్యోతి



నారాయణరెడ్డి

కర్నూలు కల్చరల్: ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు జిల్లాలో ఇద్దరికి పిలుపు అందింది. అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో ఈనెల 9,10 తేదీల్లో ఉత్సవాలు జరుగుతాయి. ఇందులో పాల్గొనేందుకు కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన తెలుగు అధ్యాపకురాలు, రచయిత్రి మశేకార్ నాగజ్యోతి, కర్నూలు నగరానికి చెందిన న్యాయవాది నరహరి నారాయణ రెడ్డిలకు పిలుపు వచ్చింది. వీరు ఉత్సవాల్లో పాల్గొని కవితాగానం/ కళా ప్రదర్శన చేయనున్నారు.

ఏపీజీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(అర్బన్): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలను ఖాతాదారులు, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. పట్టణంలోని ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన ఏపీజీబీ మెయిన్‌బ్రాంచ్ నూతన భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.

పాలన చేరువై.. సేవలు మెరుగై

నేటితో కొత్త జిల్లాకు ఏడాది పూర్తి

➢ ఆదోని మండలం బైచిగేరికి చెందిన పద్మావతి ఒంటరి మహిళ. ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకోగా జగనన్న కాలనీలో అధికారులు మంజూరు చేశారు. అయితే, కొందరు ఆమెకు నీకెందుకు స్థలం అంటూ ఆక్రమించుకునే ప్రయత్నం చేశారు. దీనిపై ఆమె స్పందనలో కలెక్టర్‌ను కలిసి విన్నవించగా ఆయన స్వయంగా అక్కడికి వెళ్లి స్థలాన్ని చూపించారు. ఎవరైనా ఆక్రమించుకుంటే కేసు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశాలు సైతం జారీ చేశారు.

➢ వెల్దుర్తికి చెందిన ఓ వృద్ధురాలు పెన్షన్ కోసం నెలలు తరబడి తహసీల్దార్, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతోంది. స్పందనలో ఒక రోజు అర్జీ ఇవ్వడంతో జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సమస్య పరిష్కారానికి తహసీల్దార్‌ను ఆదేశించారు. అయితే, ఆ కుటుంబంలో అప్పటికే కోడలుకు పెన్షన్ వస్తుండడంతో వృద్ధురాలికి ఇవ్వలేని పరిస్థితి. ఈ విషయం తెలుసుకున్న జేసీ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టి వృద్ధురాలిని కోడలి రేషన్ కార్డులో నుంచి వేరు చేసి పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకున్నారు.

➢ .. కొత్త జిల్లాలు ఏర్పాటైన తరువాత స్వయంగా ఉన్నతాధికారులే ఫీల్డ్‌కు వెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు వీలు కలిగింది. ఒక స్పందన అర్జీలే కాదు. సంక్షేమ, అభివృద్ధి పనులపై కూడా ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరిగింది. ప్రజలకు పాలనను చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జిలాల పునర్విభజన సత్ఫలితాలిస్తోంది. నేటితో కొత్త జిల్లాలు ఏర్పాటై ఏడాదైన సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.



పత్తికొండలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు



సచివాలయాన్ని పరిశీలిస్తున్న జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

- సత్ఫలితాలిస్తున్న జిల్లాల పునర్విభజన
- అందుబాటులో ఉన్నతాధికారులు
- ప్రజలకు చేరువైన పాలన
- స్పందన సమస్యలకు సత్వర పరిష్కారాలు
- సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై పెరిగిన పర్యవేక్షణ
- నెలలో పది రోజులు క్షేత్ర స్థాయిలోనే కలెక్టర్, జేసీ, ఇతర ఉన్నతాధికారులు
- శరవేగంగా ప్రగతి పనులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాల విభజన తరువాత అధికారులు ప్రజలకు సత్వర సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. నంద్యాల కొత్త జిల్లాగా ఆవిర్భవించడంతో కర్నూలు జిల్లా విస్తీర్ణం తగ్గింది. దీంతో స్పందనలో ఫిర్యాదుల సంఖ్య గతంతో పోల్చుకుంటే తగ్గాయి. ఫలితంగా వినతులను ఎప్పటికప్పుడు నిర్దేశిత సమయంలో పరిష్కరించేందుకు వీలు కలుగుతోంది. అంతేకాక గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి రోజు 3 నుంచి 5 గంటల మధ్య అర్జీలు స్వీకరిస్తుండడంతో చాలా వరకు అక్కడికక్కడే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. స్పందనకు ఎక్కువగా వచ్చే వినతుల్లో రెవెన్యూశాఖకు సంబంధించినవి ఉన్నాయి. ఇందులో ఏడాది కాలంలో దాదాపు 8 వేల సమస్యలు సర్వే విభాగానివే. వీటి శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకం ప్రవేశపెట్టి రీసర్వే చేస్తోంది. దీంతో ప్రస్తుతం భూ సంబంధ సమస్యలపై ఫిర్యాదులు కూడా తగ్గిపోయాయి.

పరుగులు పెడుతున్న అభివృద్ధి పనులు

గతేడాది ఏప్రిల్ 4వ తేదీన కర్నూలు జిల్లా మూడు రెవెన్యూ డివిజన్‌లు, 26 మండలాలతో ఏర్పాటైంది. ఆ రోజు నుంచే అధికారులు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. ఏ గ్రామంలో చూసినా రీ సర్వే, జగనన్న కాలనీలు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, బల్క్ మిల్క్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు దర్శనమిస్తున్నాయి. గతంలో ఎప్పుడూ లేనివిధంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రగతి పనులు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లాకు 486 జగనన్న కాలనీల్లో 46,900 గృహాలు మంజూరైతే ఏప్రిల్ రెండో వారం నాటికీ 10 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు అధికారులు కంకణం కట్టుకున్నారు. ఇందుకు కలెక్టర్, జేసీ, హౌసింగ్ పీడీ, ఇతర శాఖల ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణే కారణం. అలాగే జిల్లాకు 447 రైతు భరోసా కేంద్రాలు మంజూరైతే ఇప్పటి వరకు 83 పూర్తి కాగా, మిగిలినవీ వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే 354 హెల్త్ సెంటర్ల నిర్మాణానికిగాను ఇప్పటి వరకు 29 పూర్తి కాగా, మరో 57 బీబీఎల్ లెవల్‌లో ఉన్నాయి. 458 సచివాలయాలకుగాను 139 పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. అలాగే రూ.138 కోట్లతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 959 పనులకు గాను 813 పనులకు కలెక్టర్ అప్రూవల్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

నెలలో 10 రోజులు క్షేత్ర స్థాయిలోనే..

చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అన్నట్లుగా జిల్లా విస్తీర్ణం తగ్గిపోవడంతో అధికారుల పర్యవేక్షణ పెరిగిపోయింది. కలెక్టర్, జేసీలు వారంలో పది రోజులు క్షేత్ర స్థాయిలోనే ఉంటున్నారు. ఇందులో ప్రతి వారంలో రెండు సచివాలయాలు, ఒక జగనన్న కాలనీలో వారు కచ్చితంగా పర్యటిస్తున్నారు. వీరితో పాటు దాదాపు 80 ప్రభుత్వ శాఖల అధికారులు కూడా వారంలో పది రోజులు క్షేత్ర స్థాయిలో ఉంటున్నారు.

సంక్షేమ పథకాలపై ప్రత్యేక శ్రద్ధ

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోంది. దీంతో అధికారులు వాటికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పేదలకు ఇంటి వద్దే అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందుతున్నారు.

క్షేత్ర స్థాయి పర్యటనలకే అధిక ప్రాధాన్యం

సమస్య ఎక్కడుంటే అక్కడే పరిష్కారం కావాలి. గతంలో ఎక్కడో కార్యాలయాల్లో ఉండి పరిష్కరించాలని కింది స్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చే వాళ్లం. జిల్లాల విభజనతో ఇప్పుడు మేమే ఫీల్డ్‌కు వెళ్తున్నాం. అక్కడికక్కడే వాస్తవ పరిస్థితులను గమనించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. అధికారుల పనితీరును స్వయంగా తెలుసుకుంటున్నాం. వారంలో తప్పనిసరిగా 2 సచివాలయాలు, ఒక్క జగనన్న లేవుట్‌ను పరిశీలిస్తున్నా.

– పి.కోటేశ్వరరావు, జిల్లా కలెక్టర్

స్వయంగా బాధితులతో మాట్లాడడానికి అవకాశం

జిల్లా విస్తీర్ణం చిన్నదికావడంతో అధికారుల పర్యవేక్షణ పెరిగింది. స్వయంగా బాధితులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో 14 నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేయాల్సి ఉండేది. ప్రస్తుతం ఆ సంఖ్య 8కి తగ్గిపోవడంతో కింది స్థాయిలో పనిచేసే వీఆర్వో, సర్వేయర్లతోనూ సమీక్షించడానికి సమయం ఉంటోంది. – ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, జేసీ, కర్నూలు

డివిజన్ కార్యాలయాలతో ఎంతో ప్రయోజనం



కర్నూలు జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్‌లు, 26 మండలాలు ఉన్నాయి. ఇందులో కర్నూలు, ఆదోని, పత్తికొండ రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. పత్తికొండ డివిజన్‌లో 9, ఆదోనిలో 9, కర్నూలులో 8 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలోకి వచ్చే మండలాల ప్రజలకు డివిజన్ కేంద్రాలు దగ్గరవడంతో ఏవైనా సమస్యలుంటే అక్కడికి వెళ్లి పరిష్కరించుకుంటున్నారు. గతంలో కర్నూలు, ఆదోని రెవెన్యూ డివిజన్‌లు ఉన్నా వాటి పరిధి ఎక్కువగా ఉండేది. గతంలో కర్నూలు డివిజన్‌లో నందికొట్కూరు, ఆత్మకూరు, డోన్ నియోజకవర్గాలతో పాటు కర్నూలు, కోడుమూరు నియోజకవర్గాలు ఉండేవి. ప్రస్తుతం కర్నూలు డివిజన్‌లో కర్నూలు, కోడుమూరు, పాణ్యంలో ఓర్వకల్లు, కల్లూరు మండలాలు ఉంటున్నాయి. అలాగే గతంలో ఆదోని డివిజన్‌లో ఉండే మండలాలు 9 మండలాలు పత్తికొండ డివిజన్‌గా విడిపోవడంతో ఆయా మండలాల ప్రజలకు అనువైన వాతావరణం నెలకొంది.

ప్రశాంతంగా పది పరీక్షలు



టౌన్ మోడల్ హైస్కూల్ కేంద్రంలో పదో తరగతి పరీక్షలు రాసేందుకు హాజరైన విద్యార్థులు

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే పరీక్షకు గంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. మొదటి రోజు కావడంతో కొందరు తల్లిదండ్రులు సెంటర్ లోపలికి వెళ్లి హాల్ టికెట్ నెంబర్లు వేసిన నోటీస్ బోర్డుల దగ్గర ఏ గదిలో తమ పిల్లల నెంబర్ ఉందో వెతికి అక్కడికి తీసుకెళ్లి కూర్చొబెట్టారు. దీంతో సెంటర్ల వద్ద సందడి కనిపించింది. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యా శాఖ అన్ని చర్యలు చేపట్టింది. దూర ప్రాంత విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని 44 రూట్లలో ప్రత్యేక బస్సులతో రవాణా సౌకర్యం కల్పించారు. కొన్ని ప్రైవేటు స్కూళ్లలో సరైన తాగునీటి సదుపాయం కల్పించకపోవడం కాస్త అసౌకర్యానికి గురిచేసింది.

మొదటి రోజు 447 మంది గైర్హాజరు

జిల్లాలోని 149 కేంద్రాల్లో ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు మొదటి రోజు 29,864 మంది విద్యార్థుల్లో 29,417 మంది విద్యార్థులు హాజరు కాగా, 447 మంది గైర్హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లా పరిశీలకులు నరసింహారావు ఏడు పరీక్ష కేంద్రాలను, డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి 6, ఫ్లయింగ్ స్క్వాడ్ 44 కేంద్రాలను తనిఖీలు చేశారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. పదవ తరగతి పరీక్షలకు 6 కేంద్రాలు, ఇంటర్మీడియట్ పరీక్షలకు 9 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగిన టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలకు 2,323 మంది విద్యార్థుల్లో 2,146 మంది హాజరు కాగా.. 177 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా పరిశీలకులు నరసింహారావు 4, డీఈఓ డాక్టర్ వి రంగారెడ్డి 3, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 15 కేంద్రాలను తనిఖీలు చేశారు. మొదటి రోజున ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు వెల్లడించారు.

సుస్థిర అభివృద్ధి సర్వే వేగవంతం

- సచివాలయ ఉద్యోగులకు జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి ఆదేశం



పంచలింగాల సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు (న్యూటౌన్): సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు చేపట్టిన సర్వేను వేగవంతం చేయాలని కర్నూలు జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి అన్నారు. సోమవారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రజలు అందుబాటులో ఉండి వారికి అవసరమైన సేవలు అందించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించి చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డులు, 0 నుంచి 5 సంవత్సరాల్లోపు పిల్లలకు ఆధార్‌కార్డు ఎన్‌రోల్‌మెంట్, అప్‌డేట్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సుస్థిర అభివృద్ధి సర్వే జిల్లా కోఆర్డినేటర్ పరిమళ, కర్నూలు మండల ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బషీరున్‌బీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటలకూ ఒక ఆరోగ్య కేంద్రం

- ప్రతి మండలంలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ సెంటర్
- ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- కర్నూలు జిల్లాలో 25, నంద్యాల జిల్లాలో 28 ఆర్‌బీకేల గుర్తింపు
- పీహెచ్‌డీసీ డాక్టర్లుగా ఆర్‌బీకే ఇన్‌చార్జులు
- వీరికి అనుబంధంగా పనిచేయనున్న తోటబడి, పొలంబడి ట్రైనర్లు
- వీరందరికీ మూడు విడతల్లో శిక్షణ
- వ్యవసాయ, ఉద్యాన పంటలకు సోకే చీడపీడలకు పీహెచ్‌డీసీల ద్వారా పరిష్కారాలు

మనుషుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. అలాగే పశువుల రోగాలను నయం చేసేందుకు వెటర్నరీ హాస్పిటల్స్ ఏర్పాటు చేశారు. వీటి తరహాలోనే పంటలను కాపేందుకు ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ సెంటర్లు (పీహెచ్‌డీసీ) ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.



పీహెచ్‌డీసీగా ఎంపిక చేసిన ఆర్‌బీకే

పెట్టుబడి వ్యయం తగ్గుతుంది



ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇప్పటికే మండలాల వారీగా ఆర్‌బీకేలను, ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లను ఎంపిక చేశాం. పంటలకు సోకే ఎటువంటి సమస్యలనైనా పీహెచ్‌డీసీల ద్వారా రైతులు పరిష్కరించుకోవచ్చు. ఇప్పటి వరకు అవగాహన లేక అడ్డుగోలుగా కెమికల్స్ వాడుతున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం పెరిగిపోతోంది. దీనిని నివారించేందుకు ప్రభుత్వం పీహెచ్‌డీసీలను ఏర్పాటు చేస్తోంది.

– పీఎల్ వరలక్ష్మి, డీఏవో, కర్నూలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతి ఏటా 10.50 లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, లక్ష హెక్టార్లలో ఉద్యాన పంటలు, 2000 హెక్టార్లలో మల్బరీ సాగవుతోంది. చీడపీడలతో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతింటున్నాయి. పంటలకు సోకిన సమస్య ఏదో తెలియక రైతులు రకరకాల పురుగుమందులు వాడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. అడ్డుగోలుగా పురుగు మందులు పిచికారీ చేయడంతో సమస్యలు మరింత పెరుగుతున్నాయి. పండించిన పంటలు విషతుల్యం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు పెంచడం, చీడపీడలను సకాలంలో గుర్తించి, వాటి నివారణకు పరిష్కారాలను సూచించడం లక్ష్యంగా ప్రభుత్వం పీహెచ్‌డీసీలను ఏర్పాటు చేస్తోంది.

వచ్చే ఖరీఫ్ నాటికి అందుబాటులోకి

మొదటి దశలో మండలానికి ఒకటి చొప్పున ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇవి వచ్చే (2023–24) ఖరీఫ్ నాటికి రైతులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రతి మండలంలో సొంత భవనంలో కొనసాగుతున్న రైతుభరోసా కేంద్రాన్ని పీహెచ్‌డీసీగా గుర్తించాల్సి ఉంది. పీహెచ్‌డీసీ డాక్టర్లుగా మొదటి ప్రాధాన్యత కింద అగ్రికల్చర్ ఎమ్మెస్సీ/ హార్టికల్చర్ ఎమ్మెస్సీ చేసిన ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లను ఎంపిక చేయాల్సి ఉంది. ఈ అర్హతలు కలిగిన వారు లేకపోతే అగ్రికల్చర్ బీఎస్సీ/ హార్టికల్చర్ బీఎస్సీ చేసిన ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లను ఎంపిక చేస్తారు. వీరు లేకపోతే అగ్రికల్చర్/ హార్టికల్చర్‌లో డిప్లొమా చేసిన వారిని ఎంపిక చేయాల్సి ఉంది. ఇప్పటికే కర్నూలు జిల్లాలో 25 మండలాలు, నంద్యాల జిల్లాలో 28 మండలాల్లో పీహెచ్‌డీసీ ఏర్పాటుకు అవసరమైన ఆర్‌బీకేలను గుర్తించడంతో పాటు పీహెచ్‌డీసీ డాక్టర్లను కూడా ఎంపిక చేయడం పూర్తి చేశారు.

మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు

ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్స్ సెంటర్ల డాక్టర్లకు అనుబంధంగా పొలంబడి ట్రైనర్స్‌లో ఇద్దరు, తోటబడి ట్రైనర్స్‌లో ఇద్దరు ఉంటారు. పొలంబడి ట్రైనర్స్‌లో జిల్లా వనరుల కేంద్రానికి చెందిన ఇద్దరు ఏవోలు, తోటబడి ట్రైనర్స్‌లో ఇద్దరు ఉద్యాన అధికారులను ఎంపిక చేయడం కూడా పూర్తి అయింది. పీహెచ్‌డీసీ డాక్టర్లు, పొలంబడి, తోటబడి ట్రైనర్స్‌కు మూడు విడతలుగా 18 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. నంద్యాలలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఏరువాక కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు వీరికి శిక్షణ ఇస్తారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు, మల్బరీ తోటలకు సోకే చీడపీడలు, వాటి లక్షణాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. పంటలకు సోకే పురుగులు, వాటిని నివారించుకునేందుకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరిస్తారు. సూక్ష్మపోషకాల లోపాలు, వాటి లక్షణాలు, వాటిని నివారించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను 18 రోజుల శిక్షణలో వివరిస్తారు. వ్యవసాయ, ఉద్యాన పంటల్లో ఎటువంటి సమస్య ఉత్పన్నమైనప్పటికీ మండలంలోని పీహెచ్‌డీసీలో నిర్ధారిస్తారు. సమస్యను అదుపు చేసుకుందుకు పరిష్కారాలను కూడా సూచిస్తారు.

క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పటిష్ట చర్యలు

కర్నూలు: పేద, సామాన్య ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేసే మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ కట్టడి కోసం పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గత మూడు రోజులుగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి పేకాట, మట్కా, బెట్టింగ్‌లపై 99 కేసులు నమోదు చేసి 160 మందిని అరెస్టు చేసినట్లు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. పేకాట నిర్వాహకుల నుంచి రూ.18 లక్షలు, మట్కా నిర్వాహకుల నుంచి రూ.22 లక్షలు, క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల నుంచి రూ.3 లక్షలు నగదుతో పాటు 12 మొబైళ్లు, 779 మద్యం బాటిళ్లు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

వెండి దొంగలపై వేటు

● సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు

కర్నూలు: కర్నూలు అర్బన్ తాలూకా పోలీస్‌స్టేషన్‌లో 105 కిలోల వెండి, రూ.2.05 లక్షల నగదును చోరీ చేసిన కేసులో కానిస్టేబుల్ రమణబాబు, హెడ్ కానిస్టేబుల్ అమరావతిపై వేటు పడింది. కేసులో వీరిద్దరితో పాటు అమరావతి భర్త విజయభాస్కర్, అతని తమ్ముడు భరత్‌సింహాలను కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు ఈనెల 1న అరెస్టు చేసి జైలుకు పంపారు. అమరావతి ప్రస్తుతం మహిళా జైలు, మిగిలిన ముగ్గురూ పంచలింగాల దగ్గర ఉన్న జిల్లా జైలులో ఉన్నారు. అమరావతితో పాటు రమణబాబు పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ దొంగతనం కేసులో జైలుకు వెళ్లడంతో శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో భద్రపరచిన వెండి, నగదు అధికారుల నిర్లక్ష్యం వల్లే మాయమైనట్లు వెలుగుచూడటంతో డీఎస్పీ స్థాయి అధికారితో విచారణ చేపట్టి నేరం రుజువు కావడంతో నలుగురిపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. అధికారుల పాత్రపైన కూడా శాఖాపరమైన విచారణ కొనసాగుతున్నట్లు ఎస్పీ వెల్లడించారు.

బెల్లం, నవసాగరం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బెల్లం, నిందితులను అరెస్ట్ చూపుతున్న సెబ్ అధికారులు

వెల్దుర్తి: సెబ్ అధికారులు సోమవారం వెల్దుర్తి మండలంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆటోలో రూ.2లక్షల విలువజేసే బెల్లం (5,580 కేజీలు), నాటుసారా తయారీకి ఉపయోగించే 60 కేజీల నవసాగరం తరలిస్తుండగా రత్నపల్లె జగనన్న కాలనీ వద్ద అదుపులోకి తీసుకుని స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్ చేసి నిందితులు బోయనపల్లెకు చెందిన పులమాడ వెంకటేశ్వర్లు, ఎర్రగుడి నడిపి అయ్యన్నను అరెస్ట్ చేసి డోన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు.



పరీక్షలు బాగా రాయాలని కర్నూలులో వినాయకుడిని మొక్కుకుంటున్న విద్యార్థులు



హొళగుంద మండలం.. పరీక్ష రాసి ఆటోలో వెళ్తున్న గజ్జహళ్లి విద్యార్థులు



మహానంది మండలం గాజులపల్లె పరీక్ష కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న దృశ్యం



పరీక్షా కేంద్రాలకు విద్యార్థులను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు



ఓర్వకల్లులో పరీక్షకు హాజరైన విద్యార్థులు

పది పరీక్ష.. మొదలైందిలా



పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు 9 గంటల లోపే చేరుకున్నారు. వీరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యా శాఖ అన్ని చర్యలు చేపట్టింది. గతంలో 11 పరీక్షలు ఉండగా, ఈసారి 6 పరీక్షలకు కుదించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

– సాక్షి బృందం



ఏ.క్యాంప్ మాంటిస్సోరి స్కూల్‌లో పదవ తరగతి పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులు



సమయం మించిపోతున్నందున పరుగు తీస్తున్న విద్యార్థి



ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో విద్యార్థినుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న చీఫ్ సూపర్‌వైజర్



నందికొట్కూరు గవర్నమెంట్ హైస్కూల్‌లో మంచినీటి సదుపాయం ఏర్పాటు దృశ్యం



నంద్యాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి



వెల్దుర్తి పరీక్ష కేంద్రం తనిఖీలో కర్నూలు డీఎస్పీ వెంకట్రామయ్య



పగిద్యాలలో అస్వస్థతకు గురైన విద్యార్థిని రేణుకకు వైద్యం అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది



పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు సూచనలిస్తున్న దృశ్యం

ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను హ్యాక్ చేశారు

● స్పందనలో బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు



స్పందనలో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కర్నూలు : ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను కొందరు వ్యక్తులు హ్యాక్ చేసి ఇతరులకు మెసేజ్‌లు, వీడియోలు పంపించి తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కర్నూలు ధర్మపేటకు చెందిన శ్రీకాంత్ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి స్వయంగా వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 107 ఫిర్యాదులు స్పందనకు వచ్చాయి.

ఫిర్యాదుల్లో కొన్ని...

● ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను హ్యాక్ చేసి ఇబ్బంది పెడుతున్న వ్యక్తులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని శ్రీకాంత్ ఎస్పీకి ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

● తల్లిదండ్రులకు చేసిన సేవలకు గాను తనకు ఇచ్చిన మూడు సెంట్ల స్థలాన్ని సోదరులు ఆక్రమించుకునేందుకు దౌర్జన్యం చేస్తున్నారని కల్లూరు మండలం పర్ల గ్రామానికి చెందిన భాగ్యమ్మ ఫిర్యాదు చేశారు.

● తన అమ్మతో తండ్రి గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఆయన ఆచూకీ కనిపెట్టి అప్పగించాలని వెల్దుర్తి పట్టణానికి చెందిన కీర్తి ఎస్పీని వేడుకున్నారు.

● హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో పరిచయమై నెల లోపు తనకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఫోన్‌పే ద్వారా తన ఖాతాకు డబ్బు వేయించుకుని మోసం చేశాడని ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె గ్రామానికి చెందిన మనోజ్ ఫిర్యాదు చేశారు.

● తన పేరుతో ఉన్న స్థలాన్ని భయపెట్టి రిజిస్టర్ చేయించుకుని కొందరు మోసం చేశారని కర్నూలు వడ్డెగేరికి చెందిన పద్మావతమ్మ ఎస్పీకి విన్నవించారు.

స్పందన ఫిర్యాదులన్నిటిపై చట్టపరిధిలో విచారణ జరిపి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. సెబ్ అడిషనల్ ఎస్పీ క్రిష్ణకాంత్ పటేల్, ఎస్బీ డీఎస్పీ వెంకటాద్రి, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు స్పందనలో పాల్గొన్నారు.

జిల్లాలో ఈనెల 14 నుంచి యువగళం

కర్నూలు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర జిల్లాలో ఈనెల 14 నుంచి ప్రారంభం కానుంది. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో కొనసాగుతున్న పాదయాత్ర 14 జిల్లాలోని బనగానపల్లెలోకి ప్రవేశించనుంది. పాదయాత్ర నిర్వహణ కమిటీ సభ్యులు, పార్టీ జోనల్-5 ఇన్‌చార్జి అమర్నాథ్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్ సోమవారం కర్నూలు చేరుకుని మౌర్యా ఇన్ హోటల్‌లోని పరిణయ హాల్ నందు ఉమ్మడి కర్నూలు జిల్లా నాయకులతో సమావేశమయ్యారు. కర్నూలు, నంద్యాల పార్లమెంటు నియోజకవర్గాల అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరువెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి బలవన్మరణం



ఆత్మహత్య చేసుకున్న కార్మికుడు నరహరి మజాహి

ఆలూరు రూరల్: ఒడిశాకు చెందిన కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రంలోని ముస్‌పల్లి మండలం అమ్మపాడు గ్రామానికి చెందిన చెందిన కార్మికుడు నరహరి మజాహి (46) హాలహర్వి మండలంలోని శిరిగాపురం- కొక్కారచేడు గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం పనుల్లో కూలీగా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం వివాహమైన ఇతనికి ఆరు నెలల క్రితం భార్య విడాకులు ఇవ్వడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో సోమవారం పని ప్రదేశంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తోటి కార్మికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు హాలహర్వి ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

జర్నలిజంలో డిప్లమా కోర్సు

– ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

కర్నూలు(సెంట్రల్): జర్నలిజం డిప్లమా కోర్సును సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. సి.రాఘవాచారి ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో 6 నెలల వ్యవధితో ఆన్‌లైన్ డిప్లమా ఇన్ జర్నలిజం కోర్సును ప్రారంభించామన్నారు. ఈ కోర్సును ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సహకారంతో పరీక్షలు నిర్వహించి 'డిప్లొమా సర్టిఫికెట్' అందజేస్తామన్నారు. మార్చి 31న నోటిఫికేషన్ విడుదలైందని.. htt pr:// prerracademy. ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసిన దరఖాస్తులను 'సెక్రటరీ, ప్రెస్ అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, 40-6/4- 8, 4వ అంతస్తు, మొహల్రాజపురం, విజయవాడకు దరఖాస్తులను ఏప్రిల్ 15వ తేదీ నాటికి పంపాలన్నారు. జర్నలిస్టులకు ఇంటర్మీడియట్, జర్నలిజంపై ఆసక్తి కలిగిన వారికి డిగ్రీ విద్యార్హతగా నిర్ణయించామన్నారు.

డ్రైవర్ దొంగలా మారి!

● 63 తులాల బంగారం, రూ.14 లక్షల నగదు రికవరీ
● అంతకు ముందు రోజు ట్రాక్టర్ చోరీ
● 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు



నిందితులను అరెస్ట్ చూపుతున్న ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: కుమార్తె వివాహానికి దాచుకున్న 63 తులాల బంగారు ఆభరణాలు, రూ.14 లక్షల నగదు ఆయన ఇంట్లో పనిచేసే డ్రైవర్, మరో ఇద్దరు డ్రైవర్‌లతో కలిసి దోచుకెళ్లిన ఘటన అవుకు మండలం రామాపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఈనెల 2న దొంగతనం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసిన 24 గంటల్లోనే కేసు ఛేదించి బాధితునికి 100 శాతం సొమ్ము అప్పగించడం విశేషం. జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. రామాపురం గ్రామానికి చెందిన మల్లు వెంకటేశ్వరరెడ్డి అవుకు మండల కేంద్రంలో శ్లాబ్ ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నాడు. కుమార్తె వివాహం కోసం 40 తులాల బంగారు బిస్కెట్లు, 13 తులాల ఆభరణాలు, రూ.14 లక్షల నగదును ముందుగానే ఇంట్లో తెచ్చి బీరువాలో దాచుకున్నాడు. ఇదంతా తన కారు డ్రైవర్ ఓబులాపురం గ్రామానికి చెందిన మేకల సూర్యచంద్రుడు గమనించాడు. ఎలాగైన కొట్టేయాలని పథకం వేశాడు. వెంకటేశ్వరరెడ్డి ఈనెల 10న తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లాలని డ్రైవర్ సూర్యచంద్రుడుతో చెప్పాడు. డ్రైవర్ ఇదే సరైన సమయమని భావించి 1వ తేదీ ఉదయం తన సెల్ ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకోవటంతో వెంకటేశ్వరరెడ్డి మరో డ్రైవర్‌ను తన కారులో తీసుకెళ్లాడు. తరువాత మరుసటి రోజు వేకువజామున సూర్యచంద్రుడు తన స్నేహితులైన అవుకు మండల కేంద్రానికి చెందిన పోతుల రామాంజనేయులు, లంకెల వస్నప్పలతో కలిసి దొంగతనానికి వెళ్లాడు. తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బెడ్‌రూమ్‌లోని బీరువా తలుపులు బద్దలు కొట్టి బంగారం, నగదు దోచుకుని పరారయ్యారు. ఉదయం ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంకటేశ్వరరెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పారు. హుటాహుటిన తిరుమల నుంచి గ్రామానికి వెళ్లి చూసి అవుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే స్పందించి డ్రైవర్ సూర్యచంద్రుడిని అదుపులోకి విచారించారు. నిందితుల వద్ద ఉన్న బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు. విచారణలో అంతకు ముందు రోజు అవుకు గ్రామంలో రూ.6 లక్షల విలువ చేసే ఒక ట్రాక్టర్‌ను కూడా దొంగిలించినట్లు అంగీకరించాడు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. దొంగతనం జరిగిన 24 గంటల్లోనే నిందితులను పట్టుకుని సొమ్ము రికవరి చేసిన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ జగదీశ్వరరెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

వ్యవసాయ ఉద్యోగుల సంఘం డైరీ విడుదల



డైరీని విడుదల చేస్తున్న జిల్లా ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ ఉద్యోగుల సేవా సంఘం-2023 డైరీని ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి, కార్యదర్శి జవహర్‌లాల్ విడుదల చేశారు. కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఉద్యోగులకు ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. కాస్త ఆలస్యంగానైన మంచి సమాచారంతో డైరీని విడుదల చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రవిప్రకాశ్, ఎంసీ కాశన్న, కోశాధికారి నాగ కిషోర్, టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్, గౌరవ అధ్యక్షుడు మునీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం



యువకుడి మృతదేహం

డోన్ టౌన్: మండల పరిధిలోని చిన్నమల్కాపురం గ్రామ సమీపంలో ఉన్న మైనింగ్ గనిలో సోమవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాలు.. గనిలో మృతదేహం ఉందని స్థానికుల నుంచి సమాచారం అందడంతో ప్యాపిలి సీఐ శ్రీరాములుతో కలిసి ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని యువకుడి మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వయస్సు 30 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై చిన్న గాయం తప్ప పెద్ద దెబ్బలు ఏమీ లేవని, ప్రమాదమా, ఆత్మ హత్యకు పాల్పడ్డాడా, లేదా హత్యా అనేది దర్యాప్తులో తేలనుందని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతుడు అలిబాషా

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. సి. బెళగల్‌కు చెందిన అలిబాషా (48) తన భార్య మైబూన్, ఐదేళ్ల కుమారుడు ఫరహత్‌తో కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్ స్కూటర్‌పై కర్నూలు నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. ఊరి శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ మలుపు వద్ద ఈర్లదిన్నె గ్రామానికి చెందిన ఆటో ఢీకొంది. ఈ ఘటనలో అలిబాషా తలకు తీవ్ర రక్తస్రావం కాగా మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని కర్నూలు ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో అలిబాషా ప్రాణాలు వదిలాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మృతుడి భార్య మైబూన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పీరయ్య తెలిపారు.